# వైకుంఠంలో... ఓ రోజు!

వైకుంఠంలో... పాలకడలిపై శేషుడి మీద పవ్వళించిన శ్రీహరి... ఎప్పటిలాగే కళ్ళు మూసుకుని యోగనిద్రలో వున్నాడు.

లక్ష్మీదేవి తలవని తలంపుగా శ్రీహరి వద్దకు చేరి 'ఎంతసేపూ అట్లా కళ్ళు మూసుకుని నిద్రపోవటమేనా?... ఇంతకుమించి వేరేం పన్లేదా?...' విసుక్కుంది భర్త పడకసీను చూచి.

'విషయమేమిటో విన్నవించుకో దేవీ...?' కన్నులు తెరవకుండానే... శ్రీమతివేపు చూడకుండానే మాట్లాడేడు శ్రీహరి.

'ఇందాక కొరియర్ కుర్రాడొచ్చి కవరొకటి ఇచ్చి వెళ్ళాడు నాథా...! మీపేరు మీద వున్నందున... నేను కవరు చించి చదవలేదు...'

'ఏం? ఎందుకని చదవలేదు?...' మళ్ళీ ప్రశ్న.

'ఎందుకొచ్చిన తలనొప్పి! మీకు కృష్ణావతారంలో వేనవేలు గోపికలతో సయ్యాటలాడారు కదా?!... వారిలో ఎవరైనా విరహబాధ భరించలేక మీకు లవ్‌లెటర్ వ్రాశారేమో...?'

'ఏంటీ? వెటకారమా...?' కనులు తెరచి భృకుటి ముడిచాడు.

'వెటకారము కాదు... ఉప్పు, కారమూ కాదు?. మీరు బహుభార్యా ప్రియులని... అన్నిలోకాల వారికీ తెల్సు...' మూతి ముప్పై వంకర్లు తిప్పింది లక్ష్మీదేవి.

'పొద్దుటే మొదలుపెట్టావా సతాయింపు! కట్టుకున్న భర్తని రాచిరంపాన పెట్టటం, సాధించటం వంటి చేష్టలు స్త్రీలకి అలవాటే కదా?! అసలు ఆడవారి మాటల్లోనే కొంచెం వుడికింపు... మరికొంచెం సాధింపు తప్పనిసరిగ వుండితీరతయ్. కదూ నా ప్రియసఖీ!'

'అదిగో... అట్లా మట్లాడితేనే వళ్ళు మండుద్ది! రెక్కలు ముక్కలు చేసుకుని ఇంటెడు చాకిరీ నేనొక్కదానే చేసుకుంటున్నాననైనా మీకు జాలిలేదు. ఓ పనిమనిషినైనా పెట్టుకోనివ్వరు! అయినా మిమ్మల్ని అనేం ప్రయోజనం? ఉద్యోగం సద్యోగంలేని మీవంటి పురుష పుంగవుడిని కట్టుకోవడం నాదే తప్పు! మగవారన్న మాటేగాని... మీకు బొత్తిగ ఆలోచనే లేదు. ఎల్లవేళలా ఇలా పవ్వళిస్తూంటే... వూబకాయమొస్తుంది. తీరా అప్పుడు వైద్యుడి దగ్గరకు పరుగెత్తికెళ్ళేకంటే... ఉదయాన్నే లేచి కాస్తంత మార్నింగ్ వాకో... జాగింగో... లేదా జిమ్ కెళ్ళటమో చేయొచ్చు కదా?...' ఉచిత సలహా భర్త ముఖాన విసిరిపారేసింది.

'ఔరా!... ఆడదానివి... అందునా అర్ధాంగివి అయివుండి... భర్తను ఈసడించుకో తగునా

దేవీ?...' పడుకున్న వాడల్లా లేచి కూర్చుని ఓ మెట్టు దిగి వచ్చినవాడిలా మాట్లాడేడు శ్రీహరి.

'ఈ కాకామాటలకే మొచ్చెలెండి! ఏమైనా అంటే వేళాపాళా లేకుండా పరాచికాలాడతారు...' కొంటె కోణంగిలా క్రీగంట భర్తకేసి చూస్తూ అంది లక్ష్మీదేవి.

'ఓ కప్పు స్ట్రాంగ్ కాఫీ తెచ్చిపెట్టు... ఈ లోపు దంతధావన కార్యక్రమం ఫినిష్ చేసుకొస్తాను ..' కూర్చున్న శ్రీహరి లేచి నిలబడ్డాడు.

'ఏం కష్టపడిపోతున్నారనీ?... తేనంటే తప్పేతుందా?.. షుగర్‌లెస్ కాఫీ తెస్తాను... చక్కెర డబ్బాలో నిండుకుంది.

'పోనీ పక్కింటి పిన్నిగారినో... ఎదురింటి అత్తయ్యగారినో దేబిరించి కాస్తంత చక్కెర అప్పు తీసుకోకపోయావా?...'

'మీకూ నాకూ ఇద్దరికీ చక్కెరతో పనేముంది గనుక?... ఇద్దరం షుగర్ పేషంట్సమైపోతిమి? అన్నీ తెలిసీ పురుషాధిక్యత ప్రదర్శించడం దేనికట...?'

'అది ఒకనాటి మాట దేవీ! నేడు అన్నింటా స్త్రీలదే పైచేయి. నీవెరుగవా? వరకట్న నిషేధం అమలులోకొచ్చె కదా?!... గృహహింస నివారణకై ప్రత్యేక కోర్టులు నెలకొని పున్నవి కదా?... చివరికి రక్షకభటులలో సైతం ఆడవారిని రిక్రూట్ చేయుచుండిరి భూలోకంలో...! అన్నీ తెలిసి నన్ను నిందించుట తగునా?...' భుజాలు పొదివి పట్టుకుని దగ్గరకు తీసుకోబోయాడు శ్రీహరి.

'ఎన్ని రూల్సు వచ్చినా... అధికారం చెలాయింపు మీదైనపుడు అబలలేం చేయగలరు? చికెన్ ఫ్రైలా కాల్చుకు తినేస్తున్నారు. వేధింపులకు గురి చేస్తున్నారు. ఇంగితం మరిచి పశువుల్లా పసిపిల్లలపై కూడా లైంగిక వేధింపులతో... హత్యలతో... ఆత్మహత్యలతో ఆడవారికి మనశ్శాంతి లేకుండా మమ్మ్మల్ని చెండుకు తింటోంది మీ మగవారు కాదా నాథా?...' మనసులో అశాంతి... ముఖంలో కోపం చోటు చేసుకున్నయ్.

'అన్నింటికీ ఒంటికాలు మీద లేచి పోట్లాడకు! కాస్త శాంతించుము దేవీ!...' చుబుకం పుచ్చుకుని మెత్తబడ్డ ధోరణితో లక్ష్మీదేవి కళ్ళల్లోకి చూశాడు దేవదేవుడు.

'చూశారా... అంతలోనే అవసరానుగుణంగా మాట్లాడి మమ్మ్మల్ని లోబరుచుకోవాలని చేసే మీ పురుష ప్రయత్నం ఎంత గొప్పదో...?'

'అదేం లేదుగానీ... నువ్వేమిటి నిన్న మొన్నటి వరకు నా పాదాలు వత్తుతూ అనురాగ మొలికిస్తూ వుండేదానివి... ఇప్పుడు... నా పాద గిట్టటంలేదెందుకని దేవీ?... నువ్వూ భూలోక మహిళల్లా మారిపోయావా ఏమిటీ?... నువ్వేం చేసినా బాధపడను గాని... డైవర్స్ మాత్రం ఇవ్వకు...'

కాస్తంత ఊరడింపుతో మనసు కుదుటపడిన లక్ష్మీదేవి కిచన్‌లోకి తుర్రుమంది.

మళ్ళీ అంతలోనే గబగబా వచ్చి 'ఇదిగో సెల్ గోల చేస్తోంది. మీకోసం ఎవరైనా ట్రై చేస్తున్నారేమో మాట్లాడుకోండి...' మొబైల్ భర్తకి అందించి తాను తిరిగి వెళ్ళిపోయింది.

సెల్ అందిపుచ్చుకున్న శ్రీహరి 'ఎవరూ? బ్రహ్మగారా!? నేనే కబురుపెట్టాలనుకుంటున్నాను. ఇంతలో మీరే కాంటాక్ట్ చేశారు. ఇప్పుడు నేనేం వినతల్చుకోలేదు. మీరు వున్న పళంగా బయల్దేరి రండి!... వచ్చేటప్పుడు... త్రినేత్రుడ్ని కూడా కల్సుకుని వెంటపెట్టుకురండి!... అబ్బా!... త్రినేత్ర సూపర్ మార్కెట్ కాదయ్యా మహానుభావా!... నీకు వయస్సైపోయింది. వృద్ధాప్యం ముంచుకురావటంతో... విన్పించటం... కన్పించటం... కష్టంగా వుంది!... అదే పరమశివుడ్ని కలుపుకురండి...' స్విచ్ ఆఫ్ చేసి విసుక్కున్నాడు శ్రీహరి.

లక్ష్మీదేవి తెచ్చిన కాఫీ కప్పు అందుకుని సిప్ చేస్తూ 'అబ్బా!... ఇది కాఫీలా లేదు. పంచకూళ్ళ కషాయంలా చేదుగా ఏడ్చింది...' ఇక తాగలేక కప్పు తిరిగిచ్చేశాడు.

'అవును మరి!... తియ్యటి రోగాలు... కమ్మటి సేవ అంటే ఇలాగే వుంటుంది! ఇదిగో ఇప్పుడే చెప్తున్నా... ఆ దేవుళ్ళిద్దరూ వచ్చాక మళ్ళీ కాఫీ అనేసి రంకె వేయకండి! కాఫీ పొడి నిండుకుంది...' వెనుదిరిగిన లక్ష్మీదేవి ఇంట్లోకి దారితీసింది.

బ్రహ్మగారు... ముక్కంటి ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఎంటరవటం చూచిన శ్రీహరి వారిని ఆహ్వానించాడు.

సుఖాశీనులౌతున్న ఇద్దరివేపూ విచిత్రంగా చూస్తూ, మీకీ మధ్య చెముడు కూడా వచ్చిందేమిటి?... మీ ఇద్దరి చెవుల్లో ఆ మిషనేమిటీ?...' ఆశ్చర్యపోయి ప్రశ్నించాడు శ్రీహరి.

అందుకు వారిద్దరు పకపకా నవ్వి 'ఇవి చెవిటి మిషన్లు కావండీ!... నారదుల వారు త్రిలోక సంచారులు కదా? వారీ మధ్య భూలోకానికెళ్ళినప్పుడు మా ఇరువురికీ ఇవి తెచ్చి చెవులలో పెట్టుకొని ఎఫ్.ఎమ్. రేడియోలో వింత సంభాషణలు... విచిత్రమైన సినిమా సాంగ్స్ వినమన్నాడు. అప్పట్నుంచీ ఇవి రాత్రింబవళ్ళు... మా చెవులకే వున్నయ్. అవునూ... మీరూ ఒకటి అర్జరివ్వకూడదూ?...' బ్రహ్మగారు సాగదీసి మరీ మాట్లాడాడు.

'నా బతుక్కి అదొక్కటే తక్కువ!... రాత్రింబవళ్ళు నా శ్రీమతి సతాయింపుతో బోర్ కొట్టి చస్తున్నాను. దానికి తోడు ఈ తద్దినం కూడా దేనికి లెండి... బైదిబై...' అని విషయం ప్రస్తావించ బోతుండగా లక్ష్మీదేవి అక్కడ మళ్ళీ ప్రత్యక్షమవటంతో శ్రీహరి నోటికి తాళం పడ్డది.

లక్ష్మీదేవి చేతిలో కాఫీ కప్పులవేపు చూస్తూ 'ఇందాక కాఫీపొడి నిండుకుందని చెప్పావు కదా?...' ప్రశ్నించాడు శ్రీహరి.

'పొరపాటైంది శ్రీవారూ? ఎప్పుడో తెచ్చి పడేసిన 'బ్రూ' ఇన్‌స్టంట్ పొట్లం అవుపించడంతో

ప్రాణం లేచొచ్చి... రెడీ చేసి తెచ్చాను... కాఫీ!...' సంజాయిషీ ఇచ్చుకుంది.

'గుడ్ మార్నింగ్ ఆంటీ' బ్రహ్మ శివుడు ఇద్దరూ ముక్తకంఠంతో విష్ చేశారు లక్ష్మీదేవికి.

'మరోలా అనుకోకు తల్లీ! ఆడవారందరినీ 'ఆంటీ' అని... మగాళ్ళందరినీ 'అంకుల్' అని భూలోకంలో పిలుస్తారట! నాకీ విషయం నారదుడు చెప్తే తెల్సింది...'

అందరూ నవ్వుకున్నారు!

'నే చెప్పేది జాగ్రత్తగా వినండి! ఎన్నో యుగాలుగా మనం ఈ పదవులనే అంటిపెట్టుకుంటున్నాం కదా?' శ్రీహరి ప్రసంగం మొదలుపెట్టాడు.

'నిజమే కదా?!...'

'లాంగ్ స్టాండింగ్‌గా పదవుల్లో వున్నవారిని బదిలీ మీద వేరొక పదవికి పంపాలంటూ... అనేకమందినుండి వినతిపత్రాలు వచ్చాయి. వారి మాట వినకపోతే మనకు పదవీగండం తప్పేట్టులేదు... ఏం చేయాలో తోచక మీకోసం కబురుపెట్టాను. మీరేదైనా సమయోచితమైన సలహా ఇద్దురూ...' బ్రతిమాలాడు శ్రీహరి.

పదవులకు ఎసరొస్తున్నదని వినగానే తనను వైకుంఠానికి అధిపతిని చేస్తే తన చిరకాల కోరిక తీరుతుంది... అని మనసులో గరళకంఠుడు తలపోశాడు. అదే మనసులో కోరికను బైటికి వెళ్ళగక్కేడు.

'ఇదిగో శివయ్యా! వైకుంఠంలో పదవి కదాని చంకలు గుద్దుకోకు. ఈ పదవిలో వున్న తలనొప్పి టెన్షన్ వేరెక్కడా వుండదు. అది గ్రహించు ముందు! ఈ పోస్ట్‌లోకి వస్తే... చిందులు వేయటానికి... స్మశానాల్లో విహరించటానికి క్షణం తీరికుండదు నీకు!...' అని శ్రీహరి కామెంట్ చేయటంతో విశ్వేశ్వరుడు నోరు మెదపలేకపోయాడు.

'అయ్యా బ్రహ్మదేవా!... మీరా కురువృద్ధులు. వినికిడి శక్తి తగ్గింది. చూపు సన్నగిల్లింది. మీరీ పదవిలో వేగలేరు సరికదా మనశ్శాంతి కరువై 'హరీ' అంటారు!... ఆలోచించుకోండి- ఆ తర్వాత మీ ఇష్టం...' నిక్కచ్చిగా మాట్లాడేడు శ్రీహరి.

ఇద్దరూ శ్రీహరి మాటలకు బిక్కచచ్చిపోయారు!

సరిగ్గా అదే సమయానికి పిలవని పేరంటానికి వచ్చినట్టు నారదుడు ఎంటరైనాడు.

ముఖం కన్పించకుండా ఇనుపబొచ్చె నారదుని శిరస్సుపై వుండటం చూసి... వెనకటికి తెనాలి రామలింగడు... రాయలవారి సభలోకి నెత్తిన కుండ బోర్లించుకు వచ్చిన సీను గుర్తుకొచ్చి ముగ్గురూ ఎగతాళిగా నారదుని చూచి నవ్వారు.

'త్రిమూర్తుల్లారా... పరిహసించకండి! భూలోకంలో వాహనచోదకులు ధరిస్తున్న హెల్మెట్!

దీనిని ధరిస్తే ప్రమాదాలు దరిదాపులకు రావు అంటేనూ... ఆ మధ్య ఎల్.టీ.సి. మీద భూలోక దర్శనానికి వెళ్ళిన నేను దీన్ని కొని తెచ్చుకుని ధరిస్తున్నాను...' అసలు సంగతి వెళ్లగక్కేడు నారద మహర్షి.

'బదిలీల ప్రహసనంతో మేము తలమునకలైనాము నారదా! నీ పదవికోసం చిత్రగుప్తుడు అర్రులు చాస్తున్నాడు! శ్రీహరి మాటలు విన్న నారదుడు బిక్కముఖం వేశాడు.

'ఇప్పటికిప్పుడు మీ నిర్ణయాలు తెలుపవలసిన అవసరంలేదు. మరో నాలుగురోజుల్లో నేను నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ నాటికి మీ మీ ఆలోచనలు ఎలా వున్నాయో నాకు చెప్పచ్చు! అలాగే... ఇంద్రుడు... సమవర్తి మొదలుగా గల వారి మనోభావాలు కూడా తెల్సుకునే అవకాశం వుంటుంది... ఇక మీరు వెళ్ళిరండి...!'

శ్రీహరి మాటలు విన్న ముగ్గురూ బరువెక్కిన హృదయాలతో అక్కడినుంచి బైటపడ్డారు.

★★★★★

టి.వి. స్క్రిప్ట్ రైటర్ గంగవరం రంగరాజు తాను కొత్తగా రాసి తెచ్చిన సరికొత్త వెరైటీ 'స్క్రిప్ట్' ఫైల్‌ని ప్రొడ్యూసర్ ముందుంచాడు.

'మొత్తానికి కథ పూర్తిచేసి తెచ్చినట్టున్నావే... వెరీగుడ్ రంగరాజూ! ఈ సీరియల్ గురించిన ........ పబ్లిసిటీ యాడ్ విడుదలచేసి రెండు వారాలైనా... నువ్వు స్క్రిప్ట్ అందివ్వని కారణంగా షూటింగ్ మొదలు పెట్టలేదు...' అంటూ ఫైల్లోని కథ సంభాషణలను గబగబా అక్కడక్కడ చదివి 'అద్భుతం'! మహాద్భుతం! తెలుగు టి.వి. సీరియల్స్ చరిత్రలోనే ఇదొక మరువలేని సీరియల్ అనటం ఖాయం...' వెనక్కువాలి వికటాట్టహాసం చేసాడు ప్రొడ్యూసర్ సన్యాసిరావ్.

ఆ మాట విన్న రంగరాజు వదనం కలువలా వికసించింది. పొగడ్తకి తెగ సంబరపడ్డాడు.

'రేపొచ్చి నీ పేమెంట్ చెక్ పట్టుకెళ్ళు రంగరాజూ...! ఇది సీరియలైజేషన్ అయ్యేలోపు అద్భుతమైన మరో కథ రెడీ చెయ్యాలి మరి...' ముందుకు వంగి షేక్‌హ్యాండ్ ఇస్తూ అన్నాడు సన్యాసిరావ్.

తృప్తితో చాటంత ముఖం చేసుకున్న రైటర్ గంగవరం రంగరాజు భుజాలెగరేసుకుంటూ నిష్క్రమించాడు.

- సమాప్తం -